Truth of News

RNI NO : APTEL/25/A0239


# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 100 | శనివారం 13 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



IRS PUBLICATIONS
irspublications12@gmail.com


# ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ప్రముఖులు
- ఇటీవలి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై గెలుపు
- మహారాష్ట్ర గవర్నర్ పదవికి నిన్ననే రాజీనామా
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి కీలక పదవికి ఎంపిక

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12



భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు మంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు హాజరయ్యారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. రాజీనామా చేసిన తర్వాత ధన్‌ఖడ్ బహిరంగంగా కనపడడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన

- మిగతా 2లో..



## నేడు ప్రధాని మోడీ
# మణిపూర్ పర్యటన

- ప్రధాని పర్యటన వేళ మణిపూర్ బీజేపీకి భారీ షాక్.. - 43 మంది నేతల రాజీనామా - ఉఖ్రుల్ జిల్లా ఫుంగ్యార్ నియోజకవర్గంలో బీజేపీకి ఎదురుదెబ్బ - అధిష్ఠానంపై అసంతృప్తి.. మూకుమ్మడి రాజీనామాలు - స్థానిక నాయకత్వాన్ని గౌరవించడం లేదంటూ నేతల తీవ్ర ఆరోపణ

మణిపూర్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12

జాతి హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సిద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధిష్ఠానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ 43 మంది స్థానిక నాయకులు, కార్యకర్తలు గురువారం మూకుమ్మడిగా తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఘటన ఉఖ్రుల్ జిల్లాలోని ఫుంగ్యార్ నియోజకవర్గంలో జరిగింది.

పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందుతున్నామని రాజీనామా చేసిన నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్గత సంప్రదింపులు, కలుపుగోలుతనం లోపించాయని, క్షేత్రస్థాయి నాయకత్వాన్ని ఏమాత్రం గౌరవించడం లేదని వారు ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు తాము కట్టుబడి ఉన్నామని, అయితే ప్రస్తుత

- మిగతా 2లో..

## గోదావరి పుష్కరాలు-2027
## తాత్కాలికం కాకుండా
# శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 'దక్షిణ కుంభమేళా'గా అభివర్ణిస్తూ కేంద్రానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రతిపాదన
- బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- కుంభమేళా నిర్వహణలో అనుభవమున్న కన్సల్టెంట్ల సేవలు తీసుకోవాలని నిర్ణయం
- పర్యాటక, నీటిపారుదల, దేవాదాయ శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని స్పష్టం

హైదరాబాద్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే కార్యాచరణను ప్రారంభించింది. ఈ పుష్కరాలను 'దక్షిణ కుంభమేళా'గా పరిగణించి, భారీ ఏర్పాట్ల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కోరాలని నిర్ణయించింది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన



ఉన్నతస్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. పుష్కరాలు ప్రారంభం కావడానికి ఇంకా 22 నెలల సమయం ఉన్నప్పటికీ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కేవలం తాత్కాలిక ఏర్పాట్లతో సరిపెట్టకుండా, భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణలో గోదావరి నది ప్రవహించే బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం

- మిగతా 2లో..




## జగన్
# అసెంబ్లీకి రావాలి

- వైసీపీకి వేరే రాజ్యాంగం ఉందేమోనన్న పవన్
- ఏపీలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటుపై పవన్ దృష్టి
- తెలుగు సినిమా పరిశ్రమకు ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ

అమరావతి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12

భారత రాజ్యాంగాన్ని గౌరవించి వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. బహుశా వైసీపీకి వేరే రాజ్యాంగం ఉందేమోనని, కానీ అది తమ ప్రభుత్వంలో చెల్లదని ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) క్యాంపస్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పవన్ తెలిపారు. ఈ ముఖ్యమైన ప్రతిపాదనపై

- మిగతా 2లో..



## బంగాళాఖాతంలో
# కేంద్రీకృతమైన అల్పపీడనం

- ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో ప్రభావం - తీరం వెంబడి గంటకు 60 కి.మీ వేగంతో బలమైన గాలులు - మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక -నేడు 7 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాల అంచనా - మిగతా ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం

అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలకు వర్ష సూచన


- మిగతా 2లో..

# సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

- 2034 నాటికి ఏపీ ఎలా ఉండబోతోందనే అంశాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు
- వే2న్యూస్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2034 నాటికి రూ. 57 లక్షల కోట్ల జీఎస్‌డీపీ సాధనే లక్ష్యం
- ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం రూ. 10 లక్షలు దాటించడమే టార్గెట్
- సూపర్ సిక్స్‌తో సంక్షేమం, ప్రణాళికలతో అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలేనని ధీమా వ్యక్తం చేసిన సీఎం

అమరావతి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12

రాబోయే దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యమని, ఇందుకోసం ఒక స్పష్టమైన, బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 2034 నాటికి రాష్ట్ర



స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని రూ. 57 లక్షల కోట్లకు, ప్రతి వ్యక్తి తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు చేర్చడమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'వే2న్యూస్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను ఆవిష్కరించి, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "కేవలం విజన్ రూపొందించడంతోనే సరిపెట్టకుండా, దాన్ని ఆచరణలో సాధ్యం చేసే దిశగా పనిచేయాలి. జాతీయ స్థాయిలో 'వికసిత్ భారత్-2047'కు అనుగుణంగా రాష్ట్రంలో

- మిగతా 2లో..



## లిక్కర్ కేసు..
# నారాయణస్వామికి బిగుస్తున్న ఉచ్చు..

- కాల్ డేటా, బ్యాంక్ లావాదేవీలపై సిట్ ఫోకస్ - లిక్కర్ స్కాం దర్యాప్తు ముమ్మరం
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఫోన్
- ఫోరెన్సిక్ నివేదికతో కీలక ఆధారాలు లభిస్తాయని అధికారుల అంచనా

అమరావతి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12

ఏపీ లిక్కర్ స్కాం దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం



(మొదటిపేజీ తరువాయి)

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆ రాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

చిన్న వయసులోనే ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులైన రాధాకృష్ణన్, తన 16వ ఏటనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. తమిళనాడు బీజేపీలో కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. తన అనుచరులు ఆయన్ను 'తమిళనాడు మోదీ' అని పిలుచుకుంటారు. మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన జార?ండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ సేవలు అందించారు.

# నేడు ప్రధాని మోడీ మణిపూర్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితుల్లో కొనసాగలేమని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో ఫుంగ్యార్ మండల అధ్యక్షుడు, మహిళా, యువ, కిసాన్ మోర్చాల అధ్యక్షులు, పలువురు బూత్ స్థాయి అధ్యక్షులు కూడా ఉన్నారు. ఈ మూకుమ్మడి రాజీనామాలపై మణిపూర్ బీజేపీ రాష్ట్ర విభాగం తీవ్రంగా స్పందించింది. ఇదంతా కేవలం పబ్లిసిటీ కోసం చేస్తున్న స్టంట్ అని, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుంగ్ షిమ్రే హొపింగ్‌సన్ కొట్టిపారేశారు. "రాజీనామా చేసిన వ్యక్తులు 2022 అసెంబ్లీ ఎన్నికల నుంచే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ఈ చర్యకు పాల్పడ్డారు" అని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు.

మే 2023లో మైతీ, కుకీ వర్గాల మధ్య జాతి హింస చెలరేగిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ మణిపూర్‌కు రావడం ఇదే తొలిసారి. సెప్టెంబర్ 13న ఆయన పర్యటన ఖరారైన నేపథ్యంలో ఈ రాజకీయ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. హింస కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు 260 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ప్రస్తుతం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లో ఉండగా, అసెంబ్లీని సుప్తచేతనావస్థలో ఉంచారు.

# గోదావరి పుష్కరాలు-2027 తాత్కాలికం కాకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, అందువల్ల ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. రోజుకు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చినా తట్టుకునేలా రోడ్లు, పార్కింగ్, తాగునీరు, స్నానఘట్టాలు, వసతి వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. రాష్ట్రంలో గోదావరి నది సుమారు 560 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుండగా, 74 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రతిపాదించారు. ప్రతి ప్రధాన ఆలయం, ఘాట్ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించి, స్థానిక అధికారులు, ఆలయ కమిటీలతో చర్చించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో కుంభమేళా, పుష్కరాల నిర్వహణలో అనుభవం ఉన్న కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సలహా ఇచ్చారు. ఈ భారీ ఏర్పాట్ల కోసం స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి కూడా నిధులు సమీకరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పర్యాటక, నీటిపారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాల నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం

(మొదటిపేజీ తరువాయి)

జారీ అయింది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో పశ్చిమమధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఈ అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఒక ద్రోణి కూడా కొనసాగుతోందని, దీని కారణంగా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) కీలక సూచనలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, కాబట్టి మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని స్పష్టం చేసింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఈ అల్పపీడనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 13) రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. ముఖ్యంగా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను సిద్ధం చేశాం. ఈ లక్ష్యాలను సాధించడం అసాధ్యమేమీ కాదు. కచ్చితమైన ఆలోచన, బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే" అని అన్నారు. రాష్ట్రంలోని భాగస్వాములందరినీ కలుపుకొని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు.


రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను ఆయన ప్రజల ముందుంచారు. "ఈ ఏడాది, గత ఏడాది రెండంకెల వృద్ధి సాధించగలిగాం. ఇదే స్ఫూర్తితో 2028-29 నాటికి రాష్ట్ర జీఎస్డీపీని రూ. 29.29 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 5.42 లక్షలకు చేరుస్తాం. ఆ తర్వాత, 2034 నాటికి జీఎస్డీపీని రూ. 57.21 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు పెంచేలా ప్రణాళికలు రూపొందించాం. ఈ మెగా డ్రీమ్‌ను నిజం చేసే బాధ్యతను ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ, "ఒకప్పుడు భారతీయులకు ప్రపంచంలో సరైన గుర్తింపు లేని సమయంలో, తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానిగా చేపట్టిన సంస్కరణలతో దేశ ప్రగతి పరుగులు పెట్టింది. 2038 నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్-1 స్థానానికి చేరుకుంటుంది. ఇందులో తెలుగువారి పాత్ర కీలకంగా ఉండాలి" అని ఆకాంక్షించారు. తాను గతంలో అమలు చేసిన విజన్ 2020 సాకారమైన తర్వాత కూడా ఇంకా కొందరు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామని చంద్రబాబు స్పష్టం చేశారు. "భారత్ లాంటి దేశంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలి. సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, సంపద సృష్టి ద్వారా అభివృద్ధికి సమానంగా నిధులు కేటాయిస్తాం. నేను కేవలం రాజకీయాల గురించే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి చెందేది కాదు, విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టించి, దాన్ని పేదలకు పంచుతున్నాం" అని వివరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవుతారని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతుందని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మెడికల్ కాలేజీలు

# ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ ఆరోపణ...

- సీఎం చంద్రబాబు క్లారిటీ
- మెడికల్ కాలేజీలపై జగన్ అబద్ధాలు చెబుతున్నారన్న సీఎం చంద్రబాబు
- నిర్మించకుండానే నిర్మించామని ప్రచారం చేసుకున్నారని విమర్శ
- తాము అమలు చేసేది పీపీపీ విధానమేనని స్పష్టీకరణ
- కాలేజీల నిర్వహణ ప్రభుత్వానిదేనని హామీ
- బెదిరింపులకు భయపడేది లేదని తేల్చిచెప్పిన సీఎం




**అమరావతి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12**

ఏపీలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తాము మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలోనే ముందుకు వెళుతున్నామని, దీనివల్ల ఎవరికీ అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. నిర్వహణ బాధ్యతలు పూర్తిగా ప్రభుత్వానివే ఉంటాయని, వైద్య విద్యార్థులకు గానీ, రోగులకు గానీ ఎలాంటి ఇబ్బంది రానివ్వబోమని తేల్చి చెప్పారు. ఈ విషయంలో ఎవరు బెదిరించినా భయపడే పరిస్థితి లేదని, ప్రభుత్వం తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా చంద్రబాబు వైసీపీ అధినేత జగన్ పై మండిపడ్డారు. మెడికల్ కాలేజీలు నిర్మించకుండానే, అన్నీ పూర్తి చేశామని జగన్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, ప్రభుత్వ విధానాలపై స్పష్టత ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనను విమర్శిస్తూనే, తమ హయాంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు గుర్తుచేశారు. "ఒకప్పుడు రాయలసీమలో పదేళ్లలో ఎనిమిదేళ్లు కరవు ఉండేది. దేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాను మేం అభివృద్ధి చేసి చూపించాం. నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరచడం, హార్టికల్చర్‌ను ప్రోత్సహించడం వల్లే ఇవాళ ఆ జిల్లా జీఎస్డీపీలో గోదావరి జిల్లాలను మించిపోయింది" అని వివరించారు. కేవలం వృథాగా పోయే నీటిని మాత్రమే బనకచర్ల కాలువలకు వినియోగిస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు.

# జగన్ అసెంబ్లీకి రావాలి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబుతో త్వరలోనే చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు.

ఎన్ఎస్డీ క్యాంపస్ ఒక చిన్నపాటి భారతదేశంలా ఉందని పవన్ అభిప్రాయపడ్డారు. తనకు నటనలో శిక్షణ ఇచ్చిన గురువు సత్యమూర్తి ఈ సంస్థ గురించి ఎంతో గొప్పగా చెప్పేవారని ఆయన గుర్తుచేసుకున్నారు. సమాజంలో కళలకు సరైన ప్రోత్సాహం లేకపోతే హింస పెరిగే ప్రమాదం ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, సినీ పరిశ్రమకు ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఇండస్ట్రీకి అవసరమైన సౌకర్యాలు, రాయితీలపై తగిన కార్యాచరణ రూపొందిస్తున్నామని పవన్ స్పష్టం చేశారు. అంతకుముందు, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పవన్ హాజరయ్యారు. అపార అనుభవజ్ఞుడైన రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి పదవికి మరింత గౌరవాన్ని తీసుకువస్తారని, ఆయన నేతృత్వంలో రాజ్యసభలో అర్థవంతమైన చర్చలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## లిక్కర్ కేసు..

# నారాయణస్వామికి బిగుస్తున్న ఉచ్చు..

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ సీనియర్ నేత నారాయణస్వామి మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపేందుకు ఏసీబీ కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అనుమతి మంజూరు చేసింది. ఈ పరిణామంతో ఈ కేసు విచారణ మరింత వేగవంతమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేసిన నారాయణస్వామి పాత్రపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే ఒకసారి ఆయన్ను విచారించిన అధికారులు, ఆయన ఫోన్‌లో స్కామ్‌కు సంబంధించిన కీలక సమాచారం ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఫోన్‌ను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపి, పూర్తిస్థాయి డేటాను విశ్లేషించాలని నిర్ణయించారు. దీనికి న్యాయస్థానం నుంచి కూడా అనుమతి లభించడంతో దర్యాప్తులో ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

మరోవైపు, సిట్ అధికారులు కేవలం ఫోన్ డేటాతోనే సరిపెట్టకుండా నారాయణస్వామి కాల్ డేటా రికార్డులు, ఆయన బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలపై కూడా లోతుగా ఆరా తీస్తున్నారు. ఎఫ్ఎస్ఎల్ నుంచి రాబోయే నివేదిక ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకం కానుందని, అందులో లభించే ఆధారాలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఈ నివేదిక కోసం సిట్ అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 33 ఏళ్ల తర్వాతే ప్రభుత్వ ఆధీనంలోకి...


## - మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై హోంమంత్రి అనిత



**అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12**

మెడికల్ కాలేజీలు పిపిపి విధానంలో 33 ఏళ్ల పాటు ప్రైవేటు సంస్థల వద్దే ఉంటాయని, ఆ తరువాత ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పిపిపి మోడల్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పుగా చిత్రీకరిస్తూ ప్రజల్లో భయం పుట్టిస్తున్నారని అన్నారు. ఈ విధానంలో యాజమాన్య హక్కులన్నీ ప్రభుత్వానికే ఉంటాయని, నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటివి ప్రైవేట్ భాగస్వామ్యంతో జరుగుతాయని పేర్కొన్నారు. 17 కాలేజీలు నిర్మించానని జగన్ అబద్ధాలు అల్లుతున్నారని, వాస్తవానికి శంకుస్థాపన రాళ్లు, బోర్డులే ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని సందర్శనకు తనతోపాటు రావాలని సవాల్ విసిరారు. బెంగళూరు నుంచి పార్ట్‌టైమ్‌గా తాడేపల్లికి వచ్చి రాష్ట్రంపై బురద జల్లుతున్నారని విమర్శించారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల పామర్రు టిడిపి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హర్షం వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై వైసిపి నిరంతరం అసత్య ప్రచారాలు చేస్తోందని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ విమర్శించారు.

# సంపాదకీయం



## రుతుపవనాల తీరు మారిందా?

### వానలు ఎందుకు ఎక్కువ పడుతున్నాయి

భారతదేశంలో రుతుపవనాలు తీవ్రంగా మారాయి. అసాధారణ వర్షాల వల్ల దేశంలోని సగం ప్రాంతం వరదల్లో చిక్కుకుంద. పంజాబ్‌లో 1988 తర్వాత అత్యంత తీవ్ర స్థాయిలో వరదలు కనిపిస్తున్నాయి.పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో 24 గంటల వ్యవధిలోనే సాధారణం కంటే 1000 శాతానికి మించి అధికంగా వర్షాలు పడ్డాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.వాయువ్య భారతదేశంలో ఆగస్టు 28 సెప్టెంబర్ 3 మధ్యన వర్షపాతం సగటు కంటే 180 శాతం ఎక్కువగా ఉంది.దక్షిణ భారతదేశంలో ఇదే కాలంలో కురిసిన వర్షం సగటు వర్షపాతం కంటే 73 శాతం ఎక్కువగా ఉంది.ఈ వారంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.వర్షాలు, వరదల కారణంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి.వరదలు పోటెత్తాయి. గ్రామాలు, పట్టణాలు నీట మునిగాయి. వందల మంది మరణించారు.పర్యావరణ మార్పుల కారణంగా రుతు పవనాల తీరు మారుతోంది.ప్రస్తుతం గాలిలో తేమ శాతం పెరుగుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.భూతాపం పెరగడం వల్ల హిందూ మహా సముద్రం, అరేబియా సముద్రం నుంచి వేడి గాలులు వస్తున్నాయి. అందుకే గాలిలో తేమ శాతం పెరుగుతోంది.గతంలో జూన్, జులై, ఆగస్ట్, సెప్టెంబర్‌లో రుతుపవనాలు స్థిరంగా వ్యాపించడం.. వాటి వల్ల వర్షాలు సమానంగా కురవడం జరిగేది.అయితే ప్రస్తుతం పొడి వాతావరణం కొంతకాలం కొనసాగిన తర్వాత కొద్ది ప్రాంతంలో ఒకేసారి పెద్దమొత్తంలో వర్షాలు కురుస్తున్నట్లు తాము గుర్తించామని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.తేమతో నిండిన భారీ మేఘాలు పర్వత ప్రాంతాల్లో కొండలను తాకినప్పుడు చిన్న ప్రాంతంలో పెద్ద వర్షం పడుతోందని నిపుణులు చెబుతున్నారు. దీన్నే క్లౌడ్ బరస్ట్‌గా వ్యవహరిస్తున్నారు.ఆగస్ట్ మొదటి వారంలో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కశ్మీర్‌లో భారీ వరదలు వచ్చి కొన్ని ఊళ్లు కొట్టుకుపోవడానికి ఇదే ప్రధాన కారణం.అయితే హిమాలయ రాష్ట్రాల నుంచి దక్షిణాది వైపు వెళ్తే భారీ వర్షాలు, వరదలకు వేరే కారణాలు కనిపిస్తాయి.ఆగస్టులో పంజాబ్, హరియాణా, దిల్లీని భారీ, అతి భారీ వర్షాలు ముంచెత్తాయి.భారత ఉపఖండంలో ఇప్పటికే ఉన్న రుతుపవన వ్యవస్థ, వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ (మధ్యధరా ప్రాంతంలో ఏర్పడే అల్పపీడనాలు, తుపానులు) తూర్పు వైపు ప్రయాణించేటప్పుడు కలవడం వల్ల ఇలా జరుగుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.స్టర్న్ డిస్టర్బెన్సెస్ తరచూ పైవాతావరణంలో భారీ మొత్తంలో చల్లని గాలులను మోసుకెళ్తుంది. కింది వాతావరణంలో రుతుపవనాలు మోసుకెళ్లే వేడి గాలులు, తేమ నిండిన గాలులను ఇవి కలిసినప్పుడు వాతావరణం తీవ్రంగా మారిపోతుంది.”రుతుపవనాలు, వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ మధ్య అరుదైన వాతావరణ కలయిక ఫలితం ఇది” అని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్‌లో వాతావరణ శాస్త్ర విభాగంలో రీసెర్చ్ సైంటిస్ట్ అక్షయ్ దేవరస్ చెప్పారు.ఉత్తరాది రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ప్రధాన కారణం రుతుపవనాలు, వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ కలయికేనని భారత వాతావరణ శాఖ నిర్ధరించింది.”రుతుపవనాలు విస్తృతంగా వ్యాపించి ఉన్నప్పుడు ఇలాంటి కలయిక అసాధారణం. ఎందుకంటే ఈ సమయంలో వెస్టర్న్ డిస్టర్బెన్సెస్ ఉత్తర దిశగా ప్రయాణిస్తాయి” అని దేవరస్ చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా పడమర నుంచి తూర్పుకు వీచే బలమైన గాలులే దీనికి కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఈ గాలుల మార్గం అనూహ్యంగా మలుపులు తిరుగుతోంది. అంటే ఇవి అంతకు ముందు తమదైన సహజ మార్గంలో వీయడం లేదు.ఇది మిగతా వాతావరణ వ్యవస్థలపైనా ప్రభావం చూపుతోంది.

గాలులు వీచే దిశ మారడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అసాధారణ వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నట్లు అధ్యయనాల్లో తేలింది.భారత్‌లోనూ ఇటీవల ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయి.దిశ మార్చుకున్న గాలులు ఉత్తరం వైపు వెళ్లాల్సిన వెస్టర్న్ డిస్టర్బెన్సెస్‌ను తూర్పు వైపు మళ్లించాయి.”ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ స్థానిక రుతుపవనాల గతిశీలతను ఎలా మారుస్తుందో చెప్పడానికి ఇది సూచిస్తుంది” అని దేవరస్ చెప్పారు.భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో అధిక వర్షపాతం వల్లనే వరదలు ఏర్పడుతున్నాయి. అయితే ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి.హిమాలయాలో ఉద్భవించే నదులకు దిగువన ఉన్న ఉత్తర భారతదేశం, పాకిస్తాన్‌లోని అనేక ప్రాంతాలు క్లౌడ్ బరస్ట్, వర్షాలు లేనప్పుడు కూడా వరదల బారిన పడ్డాయి.హిమనీనదాలు వేగంగా కరగడం, అవి వేగంగా ప్రవహించడం వల్ల భూగర్భ సరస్సులు పైకి వచ్చి ఆ ప్రవాహాలను అడ్డుకోవడం వల్ల కృత్రిమ సరస్సులు ఏర్పడటం, వాటి వల్ల వరదలు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.కచ్చితమైన కారణాలు తెలియనప్పటికీ, గ్లోబల్ వార్మింగ్ వల్ల వేగంగా కరుగుతున్న హిమనీనదాలు, కరిగిపోతున్న మంచు క్షేత్రాలు లాంటివి పర్వత ప్రాంతాల్లో అస్థిర వాతావరణ పరిస్థితుల్ని సృష్టిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.పర్వతాల్లో వాలుగా ఉండే ప్రాంతాలను స్థిరంగా ఉంచడానికి మంచు సిమెంట్‌లాగా పని చేస్తుంది.వర్షాలు కురిస్తే ఈ పరిస్థితి మారుతుంది.భూతాపం కారణంగా ఎత్తైన ప్రాంతాల్లో ఎక్కువగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇక్కడ నీరు ఇంకడం వల్ల నేల మెత్తగా మారుతుంది. దీంతో పర్వతాలు గట్టిదనాన్ని కోల్పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.”వర్షం కురిసి, భారీ మొత్తంలో నీరు వరదగా ప్రవహించినప్పుడు ఒకటి రెండు రోజుల్లో పర్వాతాల్లో మంచు అంతా కరిగిపోవడాన్ని మేం చూస్తున్నాం” అని గ్రాజ్ యూనివర్సిటీలో జియో సైంటిస్ట్ జాకబ్ స్టైనర్ అన్నారు.

భూ తాపం పెరగడం వల్ల వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు తోడు మనుషుల చర్యలు కూడా వరదలకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.పర్వతాలు, మైదాన ప్రాంతాల్లో నదుల ప్రవాహాన్ని అడ్డుకుంటూ అనేక నిర్మాణాలు జరుగుతున్నాయి. నదీ తీరాల వెంబడి జరుగుతున్న ఆక్రమణలు కూడా దీనికి కారణంగా మారుతున్నాయి.పర్వత ప్రాంతాల్లో రహదారులు, సొరంగాలు, జల విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం వంటి వాటి వల్ల పర్వతాలు బలహీనపడుతున్నాయి.ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ, చాలా చోట్ల నదుల కరకట్టలు, కాల్వల ఆధునీకీకరణ లాంటి పనులు చేపట్టలేదు.పట్టణ ప్రాంతాల్లో వరద ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డంకిగా మారుతున్నాయి.భారీ వర్షాలు, వరదల వల్ల నష్టాలను తగ్గించడానికి సమస్యలను ముందే పరిష్కరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తురకపాలెం మరణాలపై కొనసాగుతున్న మిస్టరీ

**గుంటూరు - సూర్య వాస్తవం**

గుంటూరు జిల్లా తురకపాలెంలో వరుస మరణాలు సంచలనంగా మారాయి. అధికారులను పరుగులు పెట్టించిన ఘటను అసలు కారణం ఏంటనేది ఇంత వరకు వెలుగులోకి రాలేదు. ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నా ప్రయోజనం లేదు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ వ్యాధి నియంత్రణ బృందం అక్కడ మరికొన్ని పరీక్షలు చేస్తోంది. అసలు విషయం గుర్తించే పనిలో ఉంది. ఓవైపు వైద్య పరీక్షలు కొసాగిస్తూనే మరోవైపు ఇతర కారణాలపై అధికారులు ఆరా తీశారు. ఈ క్రమంలోనే కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఈ మిసరీ మరణాల కేసు మరో మలుపు తిరిగేటట్టు కనిపిస్తోంది. ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష వైద్యం కారణంగానే ఇదంతా జరిగిందనే అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన సెలైన్ వాడకం, మితి మీరిన డోస్‌లో మందులు ఇవ్వడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందా అన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. తురకపాలెంలో జ్వరం వచ్చిన తర్వాత చాలా మంది బాధితులు అనుమానిత ఆర్ఎంపీ వద్దే చికిత్స చేయించుకున్నారని తెలుస్తోంది.

వారికి చికిత్స చేసే క్రమంలో కాలం చెల్లిన సెలైన్‌తోపాటు, మోతాదుకు మించిన యాంటీ బయాటిక్స్ వాడినట్టు అధికారులు గుర్తించారు. ఈ చర్యల వల్ల బాధితులకు జ్వరాలు తగ్గకపోవడంతో పాటు ప్రాణాంతకంగా మారినట్టు భావిస్తున్నారు. పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత వాళ్లంతా వేర్వేరు ఆసుపత్రులను ఆశ్రయించా రని తెలు స్తోంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడిన తర్వాత అధికారులు ఆర్ఎంపీ వైద్యంపై క్లారిటీకి వచ్చారు.




దీంతో ఆర్ఎంపీ నిర్వహిస్తన్న క్లినిక్‌లో జిల్లా వైద్యాధికారులు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో యాంటీబయోటిక్ మందులు గుర్తించారు. అనంతరం క్లినిక్‌ను సీజ్ చేశారు. ప్రస్తుతం అధికారుల అదుపు లోనే ఆర్ఎంపీ ఉన్నారు. చేసిన వైద్యంపై ప్రశ్నిస్తు న్నారు. ఇలాంటి వైద్యం ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు

**ఆర్ ఎంపీ క్లినిక్ సీజ్**

భయానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన తురకపాలెంలో గ్రామంలోని ఓ ఆర్ఎంపీ నడుపుతోన్న క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. మృతుల్లో కొందరు ఆర్ఎంపీ వద్దే తొలుత చికిత్స పొందినట్లు గుర్తించారు. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్‌ను బాధితులకు ఆర్ఎంపీ ఇచ్చినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాదు, ఎక్కువగా సెలైన్ల వాడకం కూడా ఇన్‌ఫెక్షన్‌కు కారణమని భావిస్తున్న అధికారులు.. ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసినట్టు వెల్లడించారు. అయితే, ఈ స్థానికులు మాత్రం ఆ ఆర్ఎంపీ వైద్యంపై విశ్వాసం వ్యక్తం చేయడం గమనార్హం. గత పదేళ్లుగా అతడు తమకు వైద్యం చేస్తున్నాడని, ఎప్పుడూ ఏం కాలేదని చెబుతున్నారు. తమ పిల్లలకు జ్వరం వచ్చినా ఆయన దగ్గరకే వెళ్తామని, చుట్టుపక్కల పది గ్రామాల్లో అతడు వైద్యం చేస్తున్నాడని అంటున్నారు.దాదాపు మూడు వేల జనాభా ఉన్న పల్నాడు జిల్లా తురకపాలెం గ్రామంలో గత ఐదు నెలల్లోనే 28 మంది చనిపోయినట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవల వెల్లడించారు. జులై, ఆగస్టులోనే 20 మంది వరకు మరణించారు. పలువురు అతి ప్రమాదకరమైన 'మెలియాయిడోసిస్' అనే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆరుగురిలో ఒకరికి 'మెలియాయిడోసిస్' పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కానీ, మెలిన్ అనే బ్యాక్టీరియా వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుండగా.. గ్రామ స్థులకు స్వయంగా ప్రభుత్వమే ఆహారం, తాగునీరు అందజేస్తోంది. అటు, పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధులు, పరిసరాలతో పాటు 68 నీటి ట్యాం కులను శుభ్రపరిచారు.మరోవైపు, తురక పాలెంలో పరిస్థితి అదుపులోకి వచ్చిందని జీజీహెచ్ వైద్యులు తెలి పారు. మెలియాయిడోసిస్ లక్షణాలతో ఆసుపత్రి చేరిన ఇద్దరు కోలుకోవటంతో వారిని డిశ్చార్జ్ చేశామని చెప్పారు. మరికొందరు అనుమానితుల నివేదికలు రా వాల్సి ఉందని పేర్కొన్నారు. అటు, ఎన్‌సీడీఏ ఆధ్వ ర్యం లోని వైద్య నిపుణుల బృందం కూడా గ్రామంలో పర్య టించి, గ్రామస్థులు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసింది.

# వీడిన శ్రీవారి పింక్ డైమండ్ మిస్టరీ

**తిరుమల- సూర్య వాస్తవం**

తిరుమల శ్రీవారి పింక్ డైమండ్ మిస్టరీ వీడింది. అసలు నిజం వెలుగులోకి వచ్చింది. అది అసలు పింక్ డైమండ్ కాదు కెంపు... 1945లో మైసూరు మహారాజు శ్రీవారికి బహూకరించారు1945 జనవరి 9న మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చి, తాను బాల్యంలో ధరించిన హారాన్ని స్వామికి సమర్పించారు. ఈ హారంలో ఉన్నది పింక్ డైమండ్ కాదని, కెంపు (రూబీ) అని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో వెల్లడైంది. మైసూరు ప్యాలెస్ రికార్డుల ప్రకారం, ఈ హారంలో కెంపులు, ఇతర రత్నాలు మాత్రమే ఉన్నాయి, పింక్ డైమండ్ గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఈ సర్వే వెల్లడించిన విషయాలతో పింక్ డైమండ్ కథ కంచికి చేరినట్లైంది. గతంలో రాజకీయ విమర్శలతో పింక్ డైమండ్ వ్యవహారం భారీగా చర్చకు తావిచ్చింది. ప్రభుత్వాన్ని, తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసేలా అప్పట్లో వైసీపీ చేసిన ప్రచారం అసత్యం అని తేల్చి చెప్పేలా కొన్ని ఆధారాలను బయటపెట్టారు ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నం. తిరుమల శ్రీవారికి విలువైన ఆభరణాలు సమర్పించిన రాజుల్లో మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ కూడా ఉన్నారు1945 జనవరి 9న తిరుమల శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. ఈ పర్యటనకు సంబంధించి మైసూర్ ప్యాలెస్ నుంచి 1944 డిసెంబరు 29న రామయ్య అనే ప్యాలెస్ అధికారి ఐఆ కమిషనర్‌కు లేఖ రాసినట్టు ఆధారాలున్నాయి. రైలు ద్వారా 1945 జనవరి 9న ఉదయం 8 గంటలకు రేణిగుంటకు చేరుకున్న రాజావారు తిరుపతి, శ్రీకాళహస్తి రాకపోకలకు 2 కార్లు ఏర్పాటు చేసేందుకు సహకరించాలంటూ ఆ లేఖలో ఉంది. టూర్ షెడ్యూల్ కాపీని కూడా పంపించారు. ఈ పర్యటనకు వచ్చినప్పుడే మహారాజు శ్రీవారికి హారాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఆ హారాన్ని విశేష ఉత్సవాల



సమయంలో ఉత్సవమూర్తులకు అలంకరిస్తోంది టీటీడీ. ఇందులో భాగంగా 2001 అక్టోబరు 21న జరిగిన గరుడ సేవలో మలయప్పస్వామికి అలంకరించిన ఆహారం..కెంపు విరిగిపోయింది.

భక్తులు విసిరిన నాణేలు తగిలి ఇలా జరిగిందని ఆ విషయాన్ని తిరువాభరణం రిజిస్టర్ లో నమోదు చేశారు. అయితే మైసూర్ మహారాజు సమర్పించిన హారంలో ఉన్నది కెంపు కాదు పింక్ డైమండ్ అని.. దాన్ని అపహరించి జెనీవాలో జరిగిన వేలంలో విక్రయించారని 2018లో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు రమణదీక్షితుల వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయ్. ఆ ఆరోపణల్లో వాస్తవం లేదంటూ జగన్నాధరావు కమిటీ ఇచ్చిన నివేదికలో పగిలిన కెంపు ముక్కలు పేష్కార్ ఆధీనంలో ఉన్నాయని స్పష్టంగా వివరణ ఇచ్చారు. అయినప్పటికీ స్వామికి కొన్నేళ్లుగా కైంకర్యాలు నిర్వహిస్తున్న రమణ దీక్షితులు ఈ మాట చెప్పడంతో భక్తులు సందేహంలో పడ్డారు. శ్రీకృష్ణ దేవరాయలు ఇచ్చిన ఆభరణాల్లో కొన్ని మాయమయ్యాయనే ఆరోపణలు రావడంతో 2009 సెప్టెంబరులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాధరావు నేతృత్వంలో ఓ కమిటీ, 2010లో జస్టిస్ వాద్వా నేతృత్యంలో మరో కమిటీ వేశారు. ఆభరణాలన్నీ సక్రమంగానే ఉన్నాయని తేలింది. జగన్నాథరావు కమిటీ కూడా 1952 నుంచి ఉన్న రికార్డుల ప్రకారం ఆభరణాలన్నీ పదిలంగా ఉన్నాయని నివేదికలో పేర్కొంది. 2001బ్రహోత్సవాల సమయంలో పగిలిన కెంపు స్థానంలో వెంటనే ఓ పగడం తిరిగి అమ ర్చినట్టు కమిటీ వివరించింది. మైసూరు మహా రాజు సమర్పించిన హారంలో పింక్ డైమండ్ లేదనే విషయాన్ని తేల్చి చెప్పారు మైసూరులోని ఆర్కియాల జికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నం రెడ్డి. మైసూరు మహారాణి ప్రమోద దేవిని కలవడంతో పాటూ ప్యాలెస్ లో రికార్డులు పరిశీలించగా ఈ విషయాలు వెలుగుచూశాయ్. దీంతో గతంలో చేసిన విమర్శలు అవాస్తవాలే అని తేలింది.రేపు ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారం...

**ఢిల్లీ వెళ్లిన సీఎం చంద్రబాబు**

- హస్తినకు పయనమైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చంద్రబాబుకు ఆహ్వానం
- ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నేతగా హాజరు
- కార్యక్రమం తర్వాత తిరిగి అమరావతికి పయనం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రేపు నూతన ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన హస్తినకు బయలుదేరారు.

గురువారం సాయంత్రం 6:30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీకి పయనమయ్యారు.

శుక్రవారం ఢిల్లీలో భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి అందిన ఆహ్వానం మేరకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన తిరిగి అమరావతికి బయలుదేరతారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# లిక్కర్ కేసులో కొత్త మలుపులు

**విశాఖపట్టణం- సూర్య వాస్తవం**

ఏపీలో మద్యం కుంభకోణం కేసు మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఒకవైపు విచారణ.. ప్రత్యేక దర్యాప్తు బృందం తనిఖీలు.. మరోవైపు నిందితుల అరెస్టు.. కోర్టు బెయిళ్లు కొనసాగుతున్నాయి. తాజాగా జగన్మోహన్ రెడ్డి సన్నిహితుడు నర్రెడ్డి సునీల్ రెడ్డికి సంబంధించిన కార్యాలయాల్లో ఏకకాలంలో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. హైదరాబాద్ తో పాటు విశాఖలోని 11 కార్యాలయాల్లో సోదాలు జరుపుతున్నారు. మద్యం కుంభకోణం కేసులో సునీల్ రెడ్డి సైతం ఉన్నారు. హైదరాబాద్లోని బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 3 స్నేహ హౌస్ లో, సాగర్ సొసైటీలో, ఖైరతాబాద్ కమలాపురి కాలనీలో, విశాఖ లోని వాల్తేరు రోడ్డులో ఉన్న కార్యాలయాల్లో సిట్ అధికారుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడ ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులకు కొన్ని ఆధారాలు పట్టుబడినట్లు సమాచారం.మద్యం కుంభకోణం కేసులో పట్టు బిగిస్తోంది ప్రత్యేక దర్యాప్తు బృందం. కానీ ఈ కేసులో అరెస్ట్ అయిన మాజీ ఐఏఎస్ అధికారి ధనంజయ రెడ్డి, అప్పటి జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీలు బెయిల్ పై విడుదల య్యారు. వారిపై ఆధారాలకు సంబంధించి చార్ట్ సీట్లో సరైనవి చూపించలేదు. దీంతో కోర్టు వారికి బెయిల్ ఇచ్చింది. అయితే మిగతా నిందితులకు సంబంధించి బెయిల్ వస్తుందని అంతా భావిస్తున్నారు. అయితే ఆ ముగ్గురు బెయిల్ విషయంలో సిట్ వ్యూహాత్మకంగా వ్యవహరించిందని తెలుస్తోంది. అదే సమయంలో ఐదు రోజుల కిందట మధ్యంతర బెయిల్ పై విడుదలయ్యారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి సమన్వయం చేసుకునేందుకుగాను ఆయన వేసిన పిటిషన్ మేరకు ఏసిబి కోర్టు బెయిల్ ఇచ్చింది. ఐదు రోజుల అనంతరం కోర్టు ఆదేశాల మేరకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో సరెండర్ అయ్యారు మిథున్ రెడ్డి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్యం కుంభకోణం కేసును చాలా తేలిగ్గా తీసుకుంది. అసలు ఇందులో ఆధారాలు లేవని చెప్పుకొచ్చింది. కానీ సిట్ దర్యాప్తు చూస్తుంటే లోతైన విచారణలా కనిపిస్తోంది.

## బీఎస్ఎన్ఎల్ సేవలు జిల్లాలో అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషి చేయాలి...

– ఎంపీ బస్తిపాటి నాగరాజు





**కర్నూలు – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** ఒడిశా రాష్ట్రంలో మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబుదృష్టికి తీసుకెళ్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. కర్నూలు నగరంలోని బీఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బీఎస్ఎన్ఎల్ (టెలికామ్ అడ్వైసరీ కమిటీ ) టీ.ఏ.సీ మెంబెర్స్ చాగి మల్లికార్జున రెడ్డి అట్టెకల్ జీవన్ కుమార్ చంద్రశేఖర్ భాస్కర్ సమావేశం లో పాల్గొన్నారు.. సమావేశంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ లో నెలకొన్న సమస్యలు, బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల పై చర్చించారు... అనంతరం ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సేవలను అందించడంలో జిల్లాను అగ్రగామిగా నిలిపెందుకు అధికారులు కృషి చేయాలని కోరారు.. బీఎస్ఎన్ఎల్ లో ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి. రమేష్ గారు ,డిప్యూటీ జనరల్ మేనేజర్ కె .రాజేశ్వర రావు, ఏజీఎం పి. శ్రీనివాసరావు, టీ.ఏ.సీ మెంబర్లు చాగి మల్లి కార్జునరెడ్డి అట్టెకల్ జీవన్ కుమార్ చంద్రశేఖర్ భాస్కర్, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు..

## ఘనంగా వై.ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**పామిడి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు మంత్రాలయం యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి కార్యాలయం నందు అనంతపురం జిల్లా వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో యువ నాయకులు ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంతకల్లు యువ నాయకులు, అనంతపురం జిల్లా మాజీ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ రెడ్డి, అనంతపురం జిల్లా వైసీపీ ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి వై ప్రదీప్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత ఇంట విషాదం



**అనంతపురం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ తోపుదుర్తి కవిత భర్త తోపుదుర్తి భాస్కరరెడ్డి కాసేపటి కిందట తుదిశ్వాస వదిలారు. గుండెపోటుకు గురై ఆయన ఆకస్మికంగా మరణించారు. తోపు దుర్తి భాస్కర్ రెడ్డి అకాల మరణానికి జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

## ముద్దుకూరి సాయి బాబుకు సత్కారం

**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** నందిగామ పట్టణం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు పార్టీ నాయకులతో కలసి మద్దూకూరి సాయిబాబుని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, పార్టీ బలోపేతానికి సాయశక్తుల కృషి చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో వివిధ హెూదాలో ఉన్న వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### మంత్రి నారా లోకేష్ చొరవతో

# నేపాల్ నుంచి జిల్లా వాసుల రాక

**- స్వస్థలానికి చేరుకున్న అనంతపురం జిల్లా వాసులు**



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12 :** రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో నేపాల్ నుంచి ఇద్దరు అనంతపురం జిల్లా వాసులు స్వస్థలానికి చేరుకున్నారు. అనంత జిల్లాకు సంబంధించి నేపాల్ లో చిక్కుకున్న వారిని సురక్షితంగా అనంతకు తీసుకురావడం జరుగుతోంది. నేపాల్ ఖాత్మాండూ నుంచి ప్రత్యేక విమానంలో గురువారం రాత్రి విశాఖ, రేణిగుంట విమానాశ్రయాలకు మన రాష్ట్రానికి చెందిన 144 మంది చేరుకున్నారు. రేణిగుంటకు చేరిన మన జిల్లా వారిని ప్రత్యేక వాహనంలో అనంతకు తీసుకొచ్చారు. ఇందుకు అనంత డీఆర్ఓ మలోలా, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపించారు. తాడిపత్రి రీసర్వే ఉప తహసీల్దారు మంజునాథ్, రాప్తాడు ఆర్ఐ కరుణాకర్, వీఆర్ఓ రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా, వారికి తిరుపతి కలెక్టర్ ప్రత్యేక వాహనాన్ని సమకూర్చగా, ఇద్దరు జిల్లా వాసులు శశికళ వైఫ్ ఆఫ్ కె.మల్లికార్జున శుక్రవారం ఉదయం స్వస్థలాలకు చేరుకున్నారు. గురువారం రాత్రి నేపాల్ నుంచి ఏపీవాసులు విశాఖ, తిరుపతి చేరుకున్నారు. ఏపీ ప్రభుత్వం చొరవతో నేపాల్ నుంచి సురక్షితంగా బాధితులు మన రాష్ట్రానికి చేరుకున్నారు. నేపాల్ నుంచి 144 మందితో విశాఖకు ప్రత్యేక విమానం రాగా.. విశాఖలో 104 మందిని దించి.. ప్రత్యేక విమానం తిరుపతికి వచ్చింది. నేపాల్ నుంచి విశాఖ మీదుగా 40 మంది బాధితులు తిరుపతికి చేరుకున్నారు. అనంతపురం జిల్లా వాసులు ఇద్దరు బాధితులను స్వస్థలాలకు నిన్న రాత్రి తరలించడం జరగగా, ఉదయం వారు స్వస్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వస్థలానికి చేరుకున్న శశికళ వైఫ్ ఆఫ్ కె.మల్లికార్జున మాట్లాడుతూ నేపాల్ లో చిక్కుకున్న మమ్మల్ని మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇక్కడకు రప్పించడం పట్ల లోకేష్ గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నారా లోకేష్ కృషితో నేపాల్ నుంచి స్వస్థలాలకు తెలుగు ప్రజలు..



**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12,:** నందిగామ పట్టణంలో శుక్రవారం నాడు రాష్ట్ర వైద్య ఆర్యోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని, ఉదయాన్నే హుటాహుటిన సచివాలయానికి చేరుకున్నారు. రియల్టైం గవర్నెన్స్ సెంటర్ వార్ రూమ్ను కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి సహాయక చర్యలను వేగవంతం నారా లోకేష్ చేశారని తెలిపారు. బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎక్కడెక్కడ ఉన్నారో లొకేషన్ కోఆర్డినేట్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం, చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా చూసారని ఈ సందర్భంగా తెలియజేసారు.కేంద్రం అండతో సమన్వంతో ఈ ఆపదలో ఉన్న ఒక్కొక్కరినీ సురక్షితంగా రక్షించడానికి లోకేష్ గారు పక్కా వ్యూహంతో ముందుకు కదిలారు.నేపాల్లో తెలుగువారు చిక్కుకుంటే జగన్రెడ్డి నుంచి కనీస స్పందన లేదు. మానవతాదృక్పథంతో కూడా వ్యవహరించలేదు. గతంలో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకుపోయిన తెలుగువారిని తీసుకురావడంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని స్వదేశానికి తీసుకురావడంలో చంద్రబాబు నాయుడుగారు కీలకపాత్ర పోషించారని గుర్తు చేసారు. నేపాల్ లో జరుగుతున్న మారణోమంలో తెలుగు వారు ఉన్నారని తెలియగానే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా స్పందించారు నారా లోకేష్ గారు.తెలుగు వారికి అపద అనే పదం వినబడితే చాలు నన్ను దాటి వారిని టచ్ చేయాలనే విధంగా ఆపదకే అడ్డుగా నిలిచారు నారా లోకేష్ గారంటూ కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, వివిధ హెూదాల చైర్మన్లు, వివిధ హెూదాల కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నాయకులు ఖర్చుపెట్టిన డబ్బులు సంపాదనే ధ్వేయంగా పనిచేస్తున్నారు

**- జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్**



**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో జిల్లాలో ఎప్పుడూ జరగని సంఘటనలు జరిగాయి అని జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు దేవినేని అవినాష్ అన్నారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మంత్రుల దగ్గర నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు నీచమైన కార్యక్రమాలు చేస్తున్నారు.దేవాలయాలకు చెందిన 40 ఎకరాల భూమిని కబ్జా చేశారు.ఎంతోమంది గొప్పవారు మంత్రులు ఎంపీలుగా పనిచేశారు కానీ దేవాలయాల భూములు దోచుకోలేదువిజయవాడ పార్లమెంట్ ఎంపీ కేశినేని చిన్ని తాను ఖర్చు పెట్టిన డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మట్టి,కాంట్రాక్టులు,భూములు అన్ని దోచుకుంటున్నారు. గోల్ఫ్ కోర్టులు, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లు దేవాలయాల భూముల్లో కట్టడం ఏమిటి 450 కోట్లు విలువ చేసే భూమిని దోచుకోవాలని ప్లాన్ చేశారు. ప్రభుత్వ అధికారులు కూడా తమ విధులకు ద్రోహం చేస్తున్నారు.కూటమి నేతలు ఏమి చెబితే అది సిగ్గు లేకుండా ఆచరిస్తున్నారు.దసరా ఉత్సవాలకు పోటీగా విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం మానేసి విజయవాడ ఉత్సవం మీద దృష్టి పెట్టారు .దసరా ఉత్సవాల మీద శ్రద్ధ పెట్టకుండా అధికారులు దాని మీద పెట్టడం ఏమిటి అని ప్రశ్నించారు.అమ్మవారి ఉత్సవాల కన్నా విజయవాడ ఉత్సవాల మీద దృష్టి పెట్టింది డబ్బులు దండుకోవడం కోసమే బిజెపి, ఆర్ఎస్ఎస్ వాళ్లు దీనిని ఖండించాలి. దేవాలయ భూముల్లో వీటిని ఏ విధంగా నిర్వహిస్తారనీ ప్రశ్నించాలి. సీఎం, డిప్యూటీ సీఎం, అధికారులు, మంత్రులు అందరు కలగజేసుకొని విజయవాడ ఉత్సవ్ నిర్వహించే వారినీ అడ్డుకోవాలి. లేనిపక్షంలో ఎన్టీఆర్ జిల్లాలోని పెద్దలందరినీ కలుపుకొని వాటిని అడ్డుకొని తీరుతాం అన్నారు.

## రేషను కార్డుదారులకు కొత్తగా స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

**- అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ**

**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12 :** జిల్లా నందు గతములో రేషను కార్డుదారులకు పంపిణీ చేయబడిన రేషను కార్డుల స్థానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా క్రొత్తగా స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏటిఎం కార్డు పరిమాణంలో కార్డు ముందు వైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద చిత్రం, చౌక ధరల దుకాణం సంఖ్య, క్యుఆర్ కోడ్ వంటి సెక్యూరిటీ ఫీచర్స్ తో కొత్త స్మార్ట్ రైస్ కార్డులను రూపొందించడమైనది. క్యుఆర్ కోడ్ స్కాన్ చేస్తే, కుటుంబానికి సంబందించి తీసుకునే సరుకుల వివరాలన్నీ కనిపించేలా కార్డును రూపొందించడమైనది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా అర్హులైన 6,57,828 రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రైస్ కార్డుల పంపిణి సెప్టెంబర్ నెల 15 వ తేది నుండి పంపిణి చేయబడును. క్యుఆర్ కోడ్ కలిగిన ఈ స్మార్ట్ రైస్ కార్డులను చౌక ధరల దుకాణాలకు మ్యాపింగ్ చేసిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయబడును. పంపిణి సమయంలో సచివాలయ ఉద్యోగులు కార్డుదారుల నుండి డిజిటల్ అంగీకారాన్ని (బయోమెట్రిక్/ఐరిస్/ఓటీపీ/ముఖం గుర్తింపు ద్వారా) పంపిణీ చేయవలెను. ఏ రేషన్ దుకాణానికి సంబంధించిన కార్డును అదే రేషన్ దుకాణం నుండి తమకు కేటాయించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగి ద్వారా పొందవలెను (కొత్త స్మార్ట్ రైస్ కార్డులను పొందుటకు పోర్టబిలిటీ లేదు). అసెంబ్లీ నియోజక వర్గాల వారిగా స్మార్ట్ రైస్ కార్డుల వివరాలు :



- అనంతపురం అర్బన్ : 57439
- గుంతకల్ : 88486
- కల్యాణదుర్గం : 87905
- రాప్తాడు : 66625
- రాయదుర్గం : 97707
- సింగనమల : 91750
- తాడిపత్రి : 86703
- ఉరవకొండ : 81213

తహసీల్దార్లు వారి మండలాల్లో జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఉద్యోగుల ద్వారా స్మార్ట్ రైస్ కార్డులను కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేసే ప్రక్రియను పర్యవేక్షణ చేయాలి. సివిల్ సప్లైస్ మరియు రెవెన్యూ శాఖల అధికారుల ద్వారా సరైన పర్యవేక్షణ ఏర్పాటు చేసి, ఎఫ్ పి షాప్ డీలర్లు జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఉద్యోగులకు పూర్తి సహకారం అందించేలా చర్యలు తీసుకొనవలెను. ఈ ప్రక్రియ యొక్క పురోగతిని రోజువారీ డాష్‌బోర్డ్ లు మరియు ప్రోగ్రెస్ రిపోర్టుల ద్వారా సమీక్షించబడును. 2025, జూన్ 30వ తేదీ వరకు అర్హులైన లబ్దిదారులకు వచ్చినటువంటి 6,57,828 స్మార్ట్ రైస్ కార్డులను ఈ మొదటి దశలో జారీ చేయబడతాయి. 2025 జూలై 1 వ తేది నుండి సెప్టెంబర్ 30వ తేదీ మధ్య అర్హత కలిగిన కార్డులను రెండవ దశలో జారీ చేయబడతాయి. జిల్లా స్థాయిలో మరియు నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో, పండుగ వాతావరణంలో కొత్త స్మార్ట్ రైస్ కార్డుల పంపిణి చేయవలసినదిగా ఆదేశాలు జారీచేయడమైనది. ఈ విషయంలో, జిల్లాలోని తహసిల్దార్లు, సివిల్ సప్లయిస్ డిప్యూటి తహసిల్దార్లు, జీఎస్‌డబ్ల్యుఎస్ ఉద్యోగులు, రేషన్ షాపు డీలర్లు అందరు సమన్వయంతో పనిచేసి తేది 15.09.2025 నుండి అర్హత కలిగినటువంటి ప్రతి కుటుంబానికి, ఇంటి వద్దనే స్మార్ట్ రైస్ కార్డుల పంపిణి సజావుగా జరిగేలా పర్యవేక్షించవలసిందిగా కోరారు.

## గర్భిణులకు ఉచిత అన్నదానం



**గుత్తి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** గుత్తి గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జ యరాం తల్లి కీ.శే. శ్రీమతి శారదమ్మ, గుమ్మనూరు నారా యణస్వామి భార్య కీ.శే.శ్రీమతి త్రివేణి జ్ఞాపకార్థం 49వ శుక్రవా రం గుత్తి పట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు ఉచిత పౌష్టిక భోజన కార్యక్రమం శుక్రవారం గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ చిప్పగిరి దేవేంద్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎల్లప్ప పాల్గొన్నారు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బీజేపీలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు ఘన సన్మానం



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12 :** లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా ఎస్ఎండి షఫీనాయక్ 11వ తేదీన రాయచోటి మార్కెట్ యార్డ్‌లో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా షఫి నాయక్ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అందుకు తోటి డైరెక్టర్లు కూడా సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం రైతు చైతన్య ప్రచార సేవ వేదిక రాష్ట్ర కన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు పాలకవర్గ సభ్యులు బిజెపి సీనియర్ నాయకులు కొర్లకుంట కృష్ణయ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ చంద్రయ్య జిల్లా కన్వీనర్ అబ్బాస్ అలీ ఖాన్ జేబీఎస్-ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు లక్కీ శశిధర్ జిల్లా నాయకులు నల్లగాల గంగాధర బిజెపి నాయకులు జై చంద్రబాబు, తిరుపతి వెంకటరమణ రవీంద్ర యాదవ్ శంకరప్ప మార్కెట్ యార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిపై జగన్ కుట్రలు మళ్లీ మొదలయ్యాయి

### - దేవినేని ఉమా తీవ్ర ఆగ్రహం



**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** ప్రజా రాజధాని అమరావతిపై జగన్ మోహన్ రెడ్డి మళ్లీ కుట్రలు మొదలు పెట్టారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర ఆరోపణలు చేశారు. శుక్రవారం పత్రిక సమావేశంలో మాట్లా డుతూ జగన్ అనుచరులైన సజ్జల రామకృష్ణారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిల ద్వారా అసలు కుట్రలు బయటపడుతున్నాయని ఆయన విమర్శించారు. జగన్ రెడ్డి అధ్వర్యంలో మరోసారి అమరావతిపై అసత్య ప్రచారాలు, దుష్ప్రచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతులపై పెట్టిన కేసులు, మహిళలపై చేసిన దాష్టీకాలు ఏపీ ప్రజలు ఇంకా మరచిపోలేదు అని పేర్కొన్నారు.మూడు ముక్కలాటతో రాష్ట్రాన్ని చీల్చాలని కుట్రలు చేసి, అభివృద్ధిని వెనక్కి నెట్టిన వారికి అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.ప్రజలు తిరస్కరించిన నేత తిరిగి మళ్లీ ఏ ముఖం పెట్టుకొని రాజధాని గురించి మాట్లాడతారని ప్రశ్నించారు.ఎన్ని కుట్రలు చేసినా, అమరావతిని ప్రజల రాజధానిగా, విశాఖను ఐటీ హబ్‌గా, రాయలసీమను ఆగ్రికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే బాధ్యత చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమికే చెల్లుతుందన్నారు.

## ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12 :** ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొడదామని ప్రజా చైతన్య సేవా సంస్థ కోఆర్డినేటర్ వరలక్ష్మి దేవి సివి రమణారెడ్డిని పేర్కొన్నారు. శుక్రవారం దేవళంపల్లి , లక్కిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చెడు వ్యసనాలకు బానిస కాకూడదని డ్రగ్స్ వాడటం చిన్న వయసు నుండే దూరంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ఆదరించాలన్నారు. సమాజంలో ఎయిడ్స్ క్షయ వ్యాధి అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు రమేష్ ఉపాధ్యాయులు రమణారెడ్డి సీతారామ సుబ్బలక్ష్మి దేవి ఎస్ఎస్ఓఆర్‌డబ్ల్యు అలేఖ్య పీఈ లక్ష్మీదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన సంకల్ప కార్యక్రమం



**అనంతపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా సంకల్ప 10 రోజుల అవగాహన కార్యక్రమాలు శుక్రవారంతో ముగిసాయి. అనంతపురం ఆర్ట్స్ కాలేజ్ లో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ మ్యారేజెస్, పిల్లహక్కులు, చైల్డ్ లేబర్, అన్ని హెల్ప్ లైన్, జెండర్ సెన్సటైజేషన్ గురించి వక్తలు తెలిపారు. మిషన్ శక్తి జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, స్కూల్ హెడ్ మాస్టర్, వసుధార, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శాంతామని, బాలల సంక్షేమ అధికారి వెంకటేశ్వరి, సూపర్ వైజర్లు ధనలక్ష్మి, కుసుమ, వన్ స్టాప్ సిబ్బంది రాజ్యలక్ష్మి, దుర్గా, మంజుల, శ్రీకళ, రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సౌమ్యంగా కనిపించే

# ఎమ్మెల్యే సౌమ్య పని విషయంలో శివంగి

### - 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన
### - ముఖ్యఅతిథులుగా హాజరైన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్







**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** అమరావతి రాజధానితో సమానంగా నందిగామను అభివృద్ధి చేసేందుకు ప్రతినిత్యం ఎమ్మెల్యే సౌమ్యతో కలిసి కృషి చేస్తున్నాం. రాబోయే రెండు నెలల్లో నందిగామ నియోజకవర్గానికి ఆయుష్ హాస్పిటల్ తో పాటు కేంద్రీయ విద్యాలయానికి కూడా శంకుస్థాపన చేసుకునే విధంగా జిల్లా ఇన్చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారంతో కృషి చేస్తున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. నందిగామ పట్టణంలో గాంధీ సెంటర్ లో దేవినేని వెంకట రమణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి విస్తరణ కోసం శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ శంకుస్థాపన మహోత్సవానికి ముఖ్య అతిథులు గా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి, నందిగామ నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యబోసు, బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, సూపరిండెంట్ కె వి ఎస్ సత్యనారాయణ పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భూమిపూజ అనంతరం శిలాఫలకం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ ప్రజల కల 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి.ఆ కలను సాకారం చేసిన ఘనత ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకే దక్కుతుందన్నారు. ఇందుకు కోసం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఎనలేని కృషికి మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారం తోడుగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలిపారు. వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఇంత త్వరగా మంజూరు కావడానికి ఎమ్మెల్యే సౌమ్య కృషే కారణమంటూ కొనియాడారు. సౌమ్యంగా కనిపించే ఎమ్మెల్యే సౌమ్య పని విషయంలో శివంగిలా పనిచేస్తారంటూ ప్రశంసించారు. ఏడాదిన్నర కాలంలో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసేందుకు అందరం కలిసి కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. హైదరాబాదు నుంచి విజయవాడకు వచ్చే సిక్స్ లైన్ బైపాస్ మార్గం నందిగామ లోని పలు గ్రామాల మార్గాల నుంచి వెళుతుందన్నారు. నందిగామ నియోజ కవర్గాన్ని పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధంచేసినట్లు తెలిపారు. పెద్దవరం గ్రామంలో డిఫెన్స్ క్లస్టర్ రానుందన్నారు.ఇక పరిటాల లోనే కాకుండా నాలుగు గ్రామాల్లో రైల్వేస్టేషన్ లు రాబోతున్నాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా వచ్చిన నాటి నుంచి ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకువచ్చి జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించేందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అంతకు ముందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... గత వైసీపీ పాలకుల రాక్షస పాలనకు గురైన ఈ ప్రాజెక్ట్‌ను తిరిగి రక్షించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఎంపీ కేశినేని శివనాద్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవం జరుపు కోవాలని ఆశించారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా వుందన్నారు. అనతి కాలంలోనే హాస్పిటల్ అభివృద్ధిని శరవేగంగా పరుగులు పెట్టిస్తా మన్నారు. తంగిరాల సౌమ్య అనునిత్యం నియోజకవర్గ అభివృద్ధి కోసం తనతో చర్చలు జరుపుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నందిగామ టౌన్ పార్టీ, మండల, నియోజకవర్గ నాయకులు, కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, నందిగామ మార్కెట్ యార్డ్ చైర్మన్ పిట్టల శ్రీదేవి , నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ చైర్మన్ కోటా వీరబాబు, బిజెపి నందిగామ ఇన్చార్జ్ మాదల రమేష్ , డిస్టిక్ హెల్త్ కోఆర్డినేటర్ మాధవి దేవి , ఆర్డీవో బాలకృష్ణ , మరియు మండల పార్టీ అధ్యక్షులు టౌన్ పార్టీ అధ్యక్షులు, ఎన్డీఏ కోటమి నాయకులు, మిల్క్ యూనియన్ డైరెక్టర్లు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, హెల్త్ డిపార్ట్మెంట్ కార్యకర్తలు, ఆశా వర్కర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### శుభ్రత పాటించి

# కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగండి

### - మున్సిపల్ కమిషనర్ లోవరాజు



**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్, యన్.టి.ఆర్. జిల్లా, కమీషనర్ అండ్ డైరెక్టర్ అఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆంధ్రప్రదేశ్, వడ్డేశ్వరం వారి ఆదేశముల ప్రకారం, నందిగామ పురపాలక సంఘ పరిదిలో మంచి నీటి సరఫరా అన్ని రిజర్వాయర్ల వద్ద, మున్నేరు, కీసర పంపింగ్ స్కీంల వద్ద మరియు పట్టణంలోని అన్ని వార్డులలో సరఫరా కాబడు మంచి నీటి కుళాయిల సరఫరా చేయబడు నీటి శాంపిల్స్ ను రీజినల్ పబ్లిక్ హెల్త్ లాబరేటరీ, మెడికల్ కాలేజీ క్యాంపస్, గుంటూరు వారిచే సెప్టెంబర్ ఆరవ తేదీన ఫిజికల్ మరియు కెమికల్ టెస్టింగ్లు చేయించబడిన రిపోర్టు నందు నందిగామ పురపాలక సంఘము నుండి సరఫరా చేయబడు మంచి నీరు, సేఫ్ వాటర్ పారామీటర్స్ ప్రకారం త్రాగుటకు శ్రేయస్కరమని తెలిపియున్నారు అని మున్సిపల్ కమిషనర్ లోవ రాజు అన్నారు. శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ నందిగామ పట్టణం మంచి నీటి సరఫరా మెయింటెనెన్స్ లో భాగముగా నందిగామ పురపాలక సంఘ రిజర్వాయర్లు మరియు సంపులు శుభ్రపరచడమైనవి. ప్రతి రోజు నందిగామ పురపాలక సంఘము నుండి సరఫరా చేయబడు మంచి నీటిని సంబంధిత సిబ్బందితో ఆర్ సి టెస్టింగ్ నిర్వహించి క్లోరిన్ నిర్ణీత శాతములో ఉండునట్లు తగు జాగ్రత్తతీసుకొనుట జరుగుచున్నది. ప్రస్తుతము భారీ వర్షముల కారణముగా పట్టణ పరిధిలో ప్రజలను అప్రమత్తం చేయుచు ఈ క్రింది సూచించబడిన జాగ్రత్తలను పాటించవలసినదిగా తెలియజేయడమైనది. మీ ఇంటి ఆవరణలో ఉన్నటువంటి మంచినీటి సంపును మరియు వాటర్ ట్యాంక్ ను కనీసం నెలకు ఒకసారి అయిన శుభ్రపరచుకొనవలెను.మీ ఇంటి ఆవరణలో ఉన్నటువంటి మంచినీటి సంపు మరియు డ్రైనేజ్ సంపు పక్కన ఉన్నట్లయితే లీకేజీలు లేకుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు.కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తగవలసినదిగా,హెూటల్స్ మరియు ఇన్స్టిట్యూట్ల నందు సురక్షితమైన తాగు నీటిని ఏర్పాటు చేసుకొనవలసినదిగా సూచించారు.డెంగ్యు, మలేరియ జ్వరము మరియు ఇతర వ్యాదుల సూచనలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ను సదర్శించి ప్రభుత్వ వైద్య సహాయం పొందవలసినదిగా కోరడమైనది.మంచినీటి ట్యాంకర్లకు సంబందించిన సమయముల గురించి జి.రంగారావు (పిట్టర్) సెల్ నెం. 9912282157 సంప్రదించవలసిందిగా కమిషనర్ తెలిపారు.

# పోషకాహారంతోనే కిశోరి బాలికల వికాసం

### - ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కురుబ హేమలత

**అనంతపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** పోషక విలువలతో కూడిన ఆహారంతోనే కిశోరి బాలికల వికాసం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కురుబ హేమలత అన్నారు. అనంతపురం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి ఫస్ట్ సెక్టార్ లోని సునీత నగర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కిశోరి వికాసం సదస్సులో ఆమె మాట్లాడారు. కిశోరి బాలికల శారీరక ఎదుగుదలకు దోహదపడే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగల రని పేర్కొన్నారు. అనంతరం అందుబాటులో దొరికే ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు వంటి వాటిని ప్రదర్శించారు. చివరగా పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు హరిప్రియ, జయ కుమారి, లక్ష్మీదేవి, శ్రీలత, నాగేశ్వరమ్మ, శ్వేత, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.



# ప్రతి పేదవాడి ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం

- ఎన్టీఆర్ వైద్య సేవల్ని మరింత విస్తృతం చేస్తున్నాం
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- 41మందికి రూ.31.39లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు
- 15మందికి రూ.10.83లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత
- సొంత వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనుల్లో ఎమ్మెల్యే సునీత





**అనంతపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవాడి ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసాగా ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు.నియోజకవర్గంలో 41మందికి రూ.31.39లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా శుక్రవారం రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన మొత్తం 15మంది లబ్ధిదారులకు 10లక్షల 83వేల 364 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ వైద్యసేవల్ని మరింత విస్తృతం చేసినట్టు చెప్పారు. అయితే దీనిని ప్రైవేటు పరం చేస్తున్నట్టు వైసీపీ నాయకులు విషప్రచారం చేస్తున్నట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతం కంటే ఈ సేవల్ని మరింత మెరుగ్గా అందిస్తామన్నారు. కొంత మంది ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించక ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే 14నెలల కాలంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందించినట్టు చెప్పారు.

ఈవిషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఉదారంగా వ్యవహరి స్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ముందు ఎమ్మెల్యే సునీత నరసంపల్లి, వెంకటాపురం సమీపంలోని తన సొంత వ్యవసాయ క్షేత్రాలకి వెళ్లారు. అక్కడ పలు రకాల పంటల్ని పరిశీలించి.. కూలీలతో మాట్లాడారు. వారం రోజులుగా సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ ఏర్పాట్లు, మంత్రుల రాక తదితర వాటితో బిజీగా గడిపిన ఎమ్మెల్యే సునీత తన సొంత క్షేత్రంలో చాలా సేపు గడిపారు...

# రికార్డ్ స్థాయిలో సీఎంఆర్ఎఫ్ కింద సాయం

- ఎమ్మెల్యే దగ్గుపాటి
- 79 మందికి రూ.79లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత
- ఇప్పటికే రూ.2.60కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద సాయం
- ఇందులో ముస్లిం మైనార్టీలు సగం మంది కంటే ఎక్కువ ఉన్నారు..





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో రికార్డు స్థాయిలో సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం రోజు ఎమ్మెల్యే దగ్గుపాటి పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మొత్తం 79 మందికి 79 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. లబ్ధిదారులందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం వంటి వెనుకబడిన ప్రాంతంలో పేద ప్రజలు ఎక్కువగా ఉన్నారన్నారు. ఆరోగ్యం విషయంలో డబ్బు ఖర్చు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. అందుకే చంద్రబాబు 2024 లో ముఖ్య మంత్రి అయినప్పటి నుంచి అనంతపురాన్ని ప్రత్యేక దృష్టితో చూస్తున్నారని అన్నారు. తాము అడిగిన వెంటనే ఏ సాయం అయినా చేస్తున్నారని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ విషయంలో ప్రతి ఫైల్ కు వెంటనే అమోద ముద్ర వేస్తున్నారన్నారు. ఇప్పటివరకు 2కోట్ల 60 లక్షల రూపాయల మేర సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందిందన్నారు. ఇందులో ఎక్కువగా ముస్లిం మైనార్టీలకే సాయం అందినట్లు చెప్పారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలకు ఇంత పెద్దన ఇంత పెద్ద ఎత్తున సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# ఏంటీ విచిత్ర వాతావరణం





**కాకినాడ- సూర్య వాస్తవం:** ఏపీలోవిచిత్ర వాతావరణం కొనసాగుతోంది. ఒకవైపు ఎండలు దంచి కొడు తున్నాయి. అదే స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఉక్కపోత, వేడి తీవ్రత కొనసాగుతోంది. సరిగ్గా ఇదే సమయంలో బంగాళాఖాతం నుంచి ఒక హెచ్చరిక వచ్చింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు పడే సూచన కనిపిస్తోంది. కొన్ని జిల్లాలకు అయితే భారీ వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. ప్రధానంగా ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు పడతాయని చెబుతోంది. విశాఖ, అల్లూరి, సీతారామరాజు, అనకాపల్లి,కాకినాడలో తీవ్రత అధికంగా ఉండనుంది. ఈనెల 14 వరకు వర్షాలు ఉండబోతున్నాయని చెబుతోంది. చాలా జిల్లాలకు వర్ష సూచన ఉంది. ప్రధా నంగా అల్లూరి,ఏలూరు, ఎన్టీఆర్,గుంటూరు, బాపట్ల,పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. విజయనగరం, విశాఖ, అనకాపల్లి,కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది.ఇంకోవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. పరిస్థితి చూస్తుంటే వేసవి( మాదిరిగానే ఉంది. ఉదయం 8 గంటలనుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండలు కాస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు దాటుతున్నాయి. అయితే ఈ నెలాఖరు వరకు ఉపరితల ఆవర్తనాలు ఏర్పడేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. అయితే నదుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంది. ప్రాజెక్టుల్లో సైతం నీటి లభ్యత అధికంగా కనిపిస్తోంది. ఖరీఫ్ కూడా ఈ ఏడాది ఆశాజనకంగా. అయితే ఎరువుల కొరత రైతులను వేధిస్తోంది. సాగునీటిపరంగా ఇబ్బందులు లేకున్నా యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈనెల చివరి వరకు వర్షాల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

# వత్తిడితో కూడిన విధుల నుండి విముక్తి కల్పించాలి

- ఎంపిడిఓకి వినతి పత్రం అందజేసిన గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది



**గుత్తి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** గుత్తి మండలం వివిధ గ్రామ వార్డు సచివాలయం సిబ్బం ది సమస్యలు పరిష్కరించాలని గుత్తి ఎంపిడిఓకిసచివాలయం సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిం టికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుండి విముక్తి కల్పిం చాలన్నారు. గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగులను మా తృశాఖలకు అప్పగి ంచాలని సమయపాలనలోని వత్తిడితో కూడిన విధుల నుండి విముక్తి కల్పించాలని అభ్యర్థిస్తున్నాం అన్నారు. కొన్ని డిపార్ట్మెంట్ వారు కా ర్యాలయ పనివేళలు పాటిం చకుండా వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించడం,సెలవు లు,పండుగలు,మరియు ఆ దివారాలలో బలవంతపు వి ధులు చేయిస్తున్నాడు.గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగు ల ప్రధాన సమస్యలునోష్నల్ ఇంక్లిమెంట్లు మంజూరు చే యాలి.ఆరు సంవత్సరాల పాటు ఒకే క్యాడర్లో సర్వీస్ చేసిన వారికి ఎ ఎ ఎస్ ప్ర కారం స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి.గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగు లకు ప్రస్తుతం అమలు అవు తున్న రికార్డు అసిస్టెంట్ క్యా డర్ ను జూనియర్ అసిస్టెం ట్ క్యాడర్ కు మార్పు చేయా లి.అన్నీ విభాగాల వారీగా ప్రమోషన్ ఛానల్స్ ఏర్పాటు చేసి జిల్లాల్ల వారీగా సీనియా రిటీ జాబితా విడుదల చే యాని,గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగులకు స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధ విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలి.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.25లక్షలమంది గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పై సమస్యల పై తీవ్ర మనోవేదనకు గురవు తూ ఆందోళన చెందున్న నే పథ్యంలో ఉద్యోగుల మనో కాంక్షలకు అనుగుణంగా ఈరోజు నుండి15రోజుల్లోగా పరిష్కారం చూపగలరని అభ్యర్థిస్తున్నాం.సమస్య లకు పరిష్కారం లభించని పక్షంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యో గుల ఐక్యవేదిక తరపున ఉద్యోగుల నియమ నిబం ధనలకు కట్టుబడి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్య క్రమాలు చేపడతామని తెలియజేస్తున్నాం అన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో మున్సిపల్ ఆఫీసు హెల్ప్ లైన్ నెంబర్ 9100986901 ఏర్పాటు



**గుత్తి- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** గుత్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాతా వరణ శాఖ సూచనల మేరకు బంగాళా ఖాతంలో వాయుగుం డం ప్రభావం వలన రానున్న 2రో జుల్లో భారీ వర్షాల సూచలకు అ ను గుణంగా గుత్తి మున్సిపల్ ఆ ఫీసు యందు ప్రత్యేక హెల్ప్ లైన్ కౌంటర్ నెంబర్ 9100986901 ను ఏర్పాటు చేశామని మున్సిప ల్ కమీషనర్ బి.జబ్బార్ మియా ఈ ప్రకటన ద్వారా తెలియజేశా రు. ఈ సందర్భంగా కమీషనర్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ మున్సి పాలిటీ పరిధిలో శిథిలా వస్థకు చేరిన, పడిపోయే స్థితిలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కమీషనర్ బి.జబ్బార్ మియా ఈ హెల్ప్ లైన్ అవకాశాన్ని వర్షా భావ పరిస్థితులు ఎదుర్కొనే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో దాతృత్వం





**పెళ్లకూరు- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని భీమవరం మోడల్ ప్రాథమిక పాఠశాలకు శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మనోజ్ హార్డ్వేర్ షాప్ యజమాని ఏ. మనోజ్ కుమార్ విద్యార్థుల ఉపయోగార్థం 50 త్రాగునీటి స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాసులను దానం చేశారు. ఒక్కొక్క గ్లాసు 50 రూపాయల విలువగలదని, మొత్తం వ్యయాన్ని స్వయంగా భరించి పాఠశాలకు అందించారని ప్రధానో పాధ్యాయులు టీఎస్ రఘు తెలిపారు. ఈ సందర్భంగా ఉపా ధ్యాయులు రవిచంద్ర, సుబ్రమణ్యం రెడ్డి, రమేష్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ – "సామాజిక బాధ్యతగా ముందుకొచ్చిన దాత మనోజ్ కుమార్ వంటి వారు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చేయూతనిస్తుండటం అభినందనీయం" అని కొనియాడారు.




## క్రిస్మస్ బిగ్ ఫైట్...
# స్పై థ్రిల్లర్ VS యాక్షన్ థ్రిల్లర్

టాలీవుడ్‌లో సంక్రాంతి, దసరాకి ఎక్కువగా సినిమాలు విడుదల కావడం మనం చూస్తూ ఉంటాం. అలాగే బాలీవుడ్‌లోనూ రంజాన్, దీపావళి ఆ తర్వాత క్రిస్మస్‌కి ఎక్కువగా సినిమాలు విడుదల అవుతూ ఉంటాయి. బాలీవుడ్‌లో ప్రతి ఏడాది క్రిస్మస్‌కి రెండు మూడు సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడటం మనం చూస్తూ ఉంటాం. ఈ ఏడాది క్రిస్మస్‌కి ఆలియా భట్ నటిస్తున్న స్పై థ్రిల్లర్ 'ఆల్ఫా'ను తీసుకు వచ్చేందుకు యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ రెడీ అవుతోంది. YRF వారు బ్యాక్ టు బ్యాక్ స్పై థ్రిల్లర్ సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు. ఇటీవలే హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లతో నిర్మించిన 'వార్ 2' తో వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా తీవ్రంగా నిరాశ పరచడంతో ఇప్పుడు ఆలియా భట్ ఆల్ఫా సినిమాపై చాలా హోప్స్ పెట్టుకున్నారు. తప్పకుండా ఆలియా మొదటి స్పై థ్రిల్లర్‌తో హిట్ కొట్టేలా ఉందని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు. ఆలియా భట్ హీరోయిన్‌గా ఆల్ఫా మూవీ ఇప్పటి వరకు యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో వచ్చిన స్పై థ్రిల్లర్స్‌లో హీరోలు మెయిన్ లీడ్ పోషిస్తూ వచ్చారు. మొదటి సారి లేడీ ఓరియంటెడ్ స్పై థ్రిల్లర్‌ను YRF సంస్థ తీసుకు రానున్న నేపథ్యంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

ఆలియా భట్ స్పై పాత్రలో కనిపించబోతుంది. అందుకోసం ఆలియా చాలా కష్టపడిందని, ఆమె చేసే యాక్షన్ సీన్స్ ఖచ్చితంగా యాక్షన్ ప్రేక్షకులకు నచ్చుతాయనే విశ్వాసంను మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సినిమా చివరి దశ షూటింగ్ వర్క్ జరుగుతుందని, మరో వైపు వీఎఫ్ఎక్స్ వర్క్, నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

అతి త్వరలోనే ఆల్ఫా నుంచి బిగ్ అప్‌డేట్ ను ఇచ్చేందుకు గాను దర్శకుడు శివ్ రావైల్ రెడీ అవుతున్నాడు. డిసెంబర్ 25న ఈ సినిమా విడుదల కావడం పక్కా అని యశ్ రాజ్ ఫిల్మ్స్ వర్గాల వారు బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

## హిట్ కొడితే
# అన్నయ్యతో లాంఛనమేనా!



మెగాస్టార్ చిరంజీవితో ఎప్పటికైనా సినిమా చేయాలన్నది డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కల. అన్ని అనుకున్నట్లు జరిగితే అన్నయ కంబ్యాక్ తర్వాత పూరి సినిమానే చేయాలి. కానీ -ఆటోజానీ- కథ సెట్ అవ్వక పోవడంతో? అక్కడితో ఆ ప్రాజెక్ట్ ఆగి పోయింది. ద్వితియార్ధం విషయంలో చిరంజీవి సంతృప్తిగా లేకపోవడంతో సాధ్యపడలేదు. అలాగని పూరి ఎక్కడా నిరుత్సాహ పడలేదు. ఆ సినిమా కాకపోతే మరో సినిమా చేస్తానని ఆనాడే ప్రకటించారు. అదే సమయంలో అన్నయ్య తో సినిమా తనకో డ్రీమ్ ప్రాజెక్ట్ అంటూ వెల్లడించారు. ఆ తర్వాత ఇద్దరు వేర్వేరు సినిమాలతో బిజీగా ఉన్నారు తప్ప మళ్లీ కలుస్తున్నట్లు ఎక్కడా ప్రచారంలోకి రాలేదు. ఇదే సమయంలో పూరి చేసిన చాలా సినిమాలు ఫ్లాప్ లు అవ్వడంతో? అన్నయ్యతో కష్టమే నన్నది తేలిపోయిన అంశంగా వైరల్ అయింది. దీంతో ప్రేక్షకాభిమానులు కూడా ఆ కాంబినేషన్ గురించి మర్చిపోయారు. ఇండస్ట్రీ లోనూ ఎక్కడా చర్చ జరగలేదు. ఈ నేపథ్యంలో తాజాగా చిరుతో పూరి సినిమా అంటూ మళ్లీ డిస్కషన్ మొదలైంది. అందుకు పూరి తీస్తోన్న తాజా చిత్రం విజయం ఒక్కటే ప్రామాణికంగా తెరపైకి వస్తోంది. మళ్లీ కలుస్తున్నారా? ఈ విషయంలో చిరంజీవి కూడా పూరికి మాటిచ్చినట్లు మరో మాట కూడా వినిపిస్తోంది. ప్రస్తుతం పూరి జగన్నాథ్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా ఓ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఫలితం పాజిటివ్ గా వస్తే గనుక చిరంజీవి సినిమా చేసే ఆలోచనలో ఉన్నట్లు, పూరికి సూచాయగా సంకేతాలు కూడా పంపినట్లు వినిపిస్తోంది. ఈ క్రమంలో చిరు-పూరి మధ్య ఫోన్ సంభాషణ కూడా జరిగిందంటున్నారు. బాలీవుడ్ లో అమితాబచ్చన్ డైరెక్ట్ చేసావ్? నాకెందుకు కథ రాయలేకపోతున్నావ్? చెప్పూ అంటూ చిరు ఆట పట్టించారట.



## వన్డే వరల్డ్ కప్ విశేషం...
# రిఫరీలు, అంపైర్లు అందరూ మహిళలే!

**- మెన్స్ ఫస్ట్ వన్డే వరల్డ్ కప్ 1975లో మొదలైతే అంతకు రెండేళ్ల ముందే 1973లో మహిళల ప్రపంచ కప్ జరిగింది**



అనుకున్నంత పేరు రాలేదు కానీ... పురుషులతో సమానంగా ఎదగలేకపోయింది కానీ.. మహిళల వన్డే ప్రపంచ కప్ ది కూడా పెద్ద చరిత్రే..! అసలు పురుషుల వరల్డ్ కప్ కంటే ముందే అమ్మాయిల ప్రపంచకప్ మొదలైంది అంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇక ఈ నెల 30 నుంచి మళ్లీ మహిళల వన్డే ప్రపంచ కప్ జరగనుంది. దీనికి భారత్ తో పాటు శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్నాయి. పురుషుల కంటే ముందే... ఆస్ట్రేలియాదే పైచేయి మెన్స్ ఫస్ట్ వన్డే వరల్డ్ కప్ 1975లో మొదలైతే అంతకు రెండేళ్ల ముందే 1973లో మహిళల ప్రపంచ కప్ జరిగింది. ఈ నెల ఆఖరు నుంచి జరిగేది 13వది. మొత్తం ఐదు దేశాలు ఆతిథ్యం ఇచ్చాయి. పురుషుల్లో మాదిరిగానే మహిళల క్రికెట్‌లోనూ ఆస్ట్రేలియాదే ఆధిపత్యం. 12 వరల్డ్ కప్‌లలో భారత్, ఇంగ్లండ్ చెరో మూడుసార్లు ఆతిథ్యం ఇచ్చాయి. ఇప్పుడు మన దేశం నాలుగోసారి వేదిక కానుంది. ఇక ఏడుసార్లు ఆస్ట్రేలియానే ప్రపంచ చాంపియన్ గా నిలిచింది. ఇంగ్లండ్ నాలుగుసార్లు, న్యూజిలాండ్ ఒకసారి గెలిచాయి. భారత్ రెండుసార్లు, వెస్టిండీస్ ఒకసారి ఫైనల్ చేరినా కప్ కొట్టలేకపోయాయి. టి20ల్లో ప్రయోగం.. వన్డేల్లో తొలిసారి ఈ నెల 30 నుంచి జరిగే ప్రపంచ కప్ లో ఓ ప్రత్యేకత ఉంది. ఈసారి టోర్నీ హిస్టరీలోనే మొదటిసారి పూర్తిగా మహిళలతో ఈవెంట్ జరపనున్నారు. అంటే.. మహిళా అంపైర్లు, మహిళా రిఫరీలే ఉంటారన్నమాట. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇప్పటికే ఈ మేరకు నియామకాలు చేసింది. గతంలో టి20 ప్రపంచ కప్, కామన్వెల్త్ గేమ్స్ లో అందరూ మహిళలే ఉన్నా.. వన్డే ప్రపంచ కప్ లో మాత్రం ఇప్పుడే ఆ ప్రయోగం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్యానెల్ ను చూస్తే 14 మంది మహిళా, నలుగురు మహిళా మ్యాచ్ రిఫరీలు సేవలందించనున్నారు. ఈ ఒక్క పోస్ట్ చాలు సమాధానం చెప్పేందుకు రిఫరీల్లో భారతీయురాలు.. అంపైరింగ్ క్రికెట్ లో చాలా బాధ్యతాయుతమైనదే కాదు... క్లిష్టమైనది కూడా. పైగా వన్డేల్లో అంటే ఇంకా ముఖ్యమైనది. తాజాగా ప్రపంచ కప్ బాధ్యతల్లో నియమితులైన అంపైర్లలో క్రికెట్ అభిమానులకు తెలిసినవారే అధికం. క్లైర్ పోల్సాక్, జాక్వెలిన్ విలియమ్స్, స్యూ రెడ్ ఫెర్న్ అయితే మూడో వన్డే ప్రపంచ కప్ ఆడుతున్నారు. ఆగెన్ బాగ్, కిమ్ కాటన్ లు రెండో ప్రపంచ కప్ లో పాల్గొంటున్నారు. రిఫరీల్లో ఎక్స్‌పీరియన్స్ తో పాటు కొత్తవారికీ చాన్స్ ఇచ్చారు. ట్రూడీ అండర్సన్, షాంద్రే ఫ్రిట్జ్ తో పాటు మిచెల్ పెరీరా, భారతీయురాలైన జీఎస్ లక్ష్మి ఇందులో ఉన్నారు. ఇది చరిత్రాత్మకం... జై షా అంపైర్లు, రిఫరీలు మహిళలే ఉంటూ ప్రపంచ కప్ వంటి మెగా టోర్నీని నిర్వహించనుండడం చరిత్రాత్మకమైన అడుగు అని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు జై షా కొనియాడారు. మహిళా క్రికెట్ లో ఇదో అద్భుతం అని పేర్కొన్నారు. కొత్త ఒరవడికి మార్గం వేస్తుందని.. స్త్రీ, పురుష సమానత్వం పెంపునకు దోహదం చేస్తుందని వివరించారు.

## ఆదివారం భారత్-పాక్ మ్యాచ్...!
# సుప్రీంలో పిటిషన్.. తలంటిన కోర్టు

**ఉగ్రదాడిలో ప్రజలు, ఆపరేషన్ సిందూర్ లో సైనికులు చనిపోయారని, రెండు దేశాల మధ్య క్రికెట్ అంటే తప్పుడు సందేశం పంపినట్లు అవుతుందని వివరించారు**




పెహల్గాం ఉగ్రదాడి అనంతరం.. ఆపరేషన్ సిందూర్ తర్వాత... భారత్ -పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే చాలా చర్చ జరిగింది. నాటి పరిణామాలతో రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు ఎన్నడూ లేనంతగా పతనం అయ్యాయి. ద్వైపాక్షిక సిరీస్ లకు ఇక అవకాశమే లేదని.. ఐసీసీ టోర్నీల్లోనూ నాకౌట్ దశ నుంచే పాకిస్థాన్ తో ఆడతామని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ప్రకటించింది. కానీ, నాలుగు నెలల్లోపే నిర్ణయం మారింది. వచ్చే ఆదివారం పాకిస్థాన్ తో టీమ్ ఇండియా తలపడనుంది. కానీ, ఈ మ్యాచ్ ను రద్ద చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. భారత్-పాక్ మ్యాచ్ రద్దు కోరుతూ వేసిన పిటిషన్ ను అర్జంటుగా విచారించాలని పిటిషనర్లు కోరారు. దీంతో సుప్రీం మండిపడింది. ఇంత అత్యవసరం ఏమిటి? అంటూ నిలదీసింది. అది కేవలం ఒక మ్యాచ్ మాత్రమే.. అలాగే జరగనివ్వండి.. ఆదివారం మ్యాచ్ ఉండగా ఇప్పుడేం చేయాలి? అంటూ సుప్రీం సూటిగా ప్రశ్నించింది. ఈ పిటిషన్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ల ధర్మాసనం ముందుకువచ్చింది. శుక్రవారం (12వ తేదీ) విచారణ జాబితాలో చేర్చకపోతే పిటిషన్ వేసి ఉపయోగం ఉండదంటూ పిటిషనర్ పేర్కొన్నారు. ఈ ఒక్క పోస్ట్ చాలు సమాధానం చెప్పేందుకు మ్యాచ్ జరగాల్సిందే...! ఆదివారం నాటి మ్యాచ్ జరగాల్సిందేనని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. పెహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ఊర్వశీ జైన్ ప్రస్తావిస్తూ.. మ్యాచ్ జరగడం జాతీయ గౌరవం, ప్రజల మనోభావాలకు విరుద్ధం అని పేర్కొన్నారు. ఉగ్రదాడిలో ప్రజలు, ఆపరేషన్ సిందూర్ లో సైనికులు చనిపోయారని, రెండు దేశాల మధ్య క్రికెట్ అంటే తప్పుడు సందేశం పంపినట్లు అవుతుందని వివరించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన దేశంతో ఆటలతో వేడుక చేసుకోవడం ఏమిటని... ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలు కూడా వేదనకు గురవుతాయని పిటిషనర్ తన పిటిషన్ లో తెలిపారు. దేశ గౌరవంతో పాటు ప్రజల భద్రత అనే విషయాలు క్రీడా వినోదం కంటే ముఖ్యమైనవని అభిప్రాయం వ్యక్తం చేశారు.

### డయేరియా ప్రభావిత ప్రాంతంలో

# పర్యటించిన మంత్రులు, ఎంపీ





**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పి.నారాయణబీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని).. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పురపాలక శాఖ సంచాలకులు పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం తదితరులతో కలిసి శుక్రవారం విజయవాడ, న్యూ రాజరాజేశ్వరిపేటలోని డయేరియా ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. కేర్ అండ్ షేర్ వీఎంసీ స్కూల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో బాధితులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను, బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలంటూ డయేరియా బాధితులకు భరోసా కల్పించారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను సమీక్షించి.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మెరుగైన వైద్య సేవలకు, ప్రజలకు అవగాహనకల్పించ డానికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు ఎదురు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. క్షేత్రస్థాయిలో 24x7 ప్రత్యేక బృందాలు సేవలంది స్తున్నాయని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సు హాసిని తదితరులు ఉన్నారు.

### రణభేరి కార్యక్రమాన్ని

## జయప్రదం చేయండి



**గాండ్లపెంట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12 :** ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యాపరమైన సమస్యల పరిష్కారానికి ఈనెల 15 నుంచి 19 వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఈటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్ వలీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద శుక్రవారం రణభేరి కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల యుటిఎఫ్ కార్యదర్శి తాహిర్ వలీ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19 వరకు చేపట్టిన రణభేరి కార్యక్రమం 17న కదిరి పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు. కావున ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున రణభేరి కార్యక్రమంలో పాల్గొని జయ ప్రదం చేయాల్సిందిగా యుటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, జిల్లా నాయకులు మల్లికార్జున, రమణ నాయక్, ఖాదర భాష, ఈటిఎఫ్ నాయకులు నారాయణరెడ్డి, సాయిరాం, సుబ్బయ్య, రమేష్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వీరన్న గట్టుపల్లిలో

## స్థల సమస్య పరిష్కారం...

### - గ్రామాన్ని సందర్శించిన పోలీసులు



**గాండ్లపెంట– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12 :** మండలంలోని గొడ్డు వెలగల గ్రామం వీరన్న గట్టుపల్లి లో గత కొంత కాలంగా మూడు సెంట్లు స్థలం కోసం ఇరువురు మధ్య చోటుచేసుకున్న స్థల సమస్యను పోలీసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు మధ్య వివాదాస్పదంగా మారిన స్థల సమస్య పరిష్కారం కోసం శుక్రవారం కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్సై రవికుమార్‌లు వీరన్న గట్టుపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నారాయణ స్వామి అనే వ్యక్తి గతంలో అదే గ్రామానికి చెందిన నరసింహులు వద్ద మూడు సెంటు స్థలాన్ని కొనుగోలు చేశాడు. అక్కడే నారాయణ స్వామి రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమం ఉన్నపలంగా రేకుల షెడ్డును తొలగించారు. దీంతో ఇరువురు మధ్య వివాదం నెలకొంది. అయితే స్థలం కొనుగోలు చేసిన నారాయణస్వామికి మూడు సెంట్లు స్థలం చూపక పోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అనంతరం సర్వేయర్ ద్వారా రెవెన్యూ రికార్డుల ప్రకారం కొలతలు వేయించారు. అనంతరం నారాయణ స్వామికి మూడు సెంట్లు స్థలానికి సంబంధించిన హద్దులు చూపించి సమస్యను పరిష్కరించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా టీడీపీ టౌన్

## కన్వీనర్ పుట్టినరోజు వేడుకలు



**పామిడి– సూర్య వాసవం, సెప్టెంబర్ 12:** పామిడి పట్టణ అధ్యక్షులు బొమ్మ మోహన్ కృష్ణ పుట్టినరోజు సందర్బంగా పామిడి పట్టణ టీడీపీ కార్యాలయం నందు శు క్రవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బొమ్మ మోహన్ చేత కేక్ కట్ చేపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొల్లు శ్రీనివాస రెడ్డి, కత్రిమల ప్రభాకర్ చౌదరి,జింకల సంజీవ, గౌస్ పీరా అప్పన్న గారి కుమార్, చీమల రాము, జనసేన అధ్యక్షులు ధనుంజయ, రాజు, బాబ వలి, రఘునాథ్ రెడ్డి, శివారెడ్డి, బొల్లు గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్ యాదవ్, తిమ్మప్ప,సంజీవ, నక్కల రామాంజనేయులు, జగదీశ్,తదితరులు పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 17 నుంచి

## స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాస్

### - డీఎంహెచ్వో ఎస్. ఫైరోజా బేగం

**పుట్టపర్తి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** మహిళల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారీ సశక్తి పరివార్ అబియాన్ ను రూపొందించిందనీ డీఎంహెచ్వో ఎస్. ఫైరోజా బేగం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఇందౌర్ లో ప్రధాని మోదీ ఈ నెల 17 న ప్రాంభించనున్నారు. అదేరోజు విశాఖపట్నంలో జరగనున్న ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారనీ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా సాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఆయుష్మాన్ మందిరాలు, ప్రాథమిక, పట్టణ ఆర్యోగ కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. శిబిరాలలో వైద్య సేవలు పొందిన వారి వివరాలను ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తామనీ ఆమె తెలిపారు

**అందించే సేవలు:** హెల్త్ కియేస్కూలు ఏర్పాటు చేస్తారు.ప్రసూతి, చిన్న పిల్లల, కంటి, ఈఎన్టీ, దంత, చర్మ, సైకియాట్రీ, సేవలు. మహిళలకు హిమోగ్లోబిన్, బిపి, షుగర్, కాన్సర్, టిబి లకు స్క్రీనింగ్ నిర్వహిస్తారు.చిన్నారులకు టీకాలు వేస్తారు.రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తారు.పౌష్టికాహారం ప్రాధాన్యత వివరిస్తారు.ఆయుష్మాన్ భారత్ జన ఆరోగ్య యోజన కార్డులు, 70 ఏళ్ళు దాటినా వారికీ వయోవందన కార్డుల జారీకి వివరాలు నమోదుచేస్తారన్నారు.




### చామకూరి శ్రీధర్

## ఐఎఎస్ సేవలు మరువలేనివి

### - బదిలీపై వెళుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను ఘనంగా సత్కరించి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్న టీడీపీ ప్రధాన నేతలు





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** అన్నమయ్య జిల్లాలో చామకూరి శ్రీధర్ చేసిన సేవలు మరు వలేని కొనియాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడిరెడ్డి రెడ్డి రాంప్రసాద్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, టిడిపి నాయకులు గంగిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి ఎల్ఆర్ పల్లె మదన్‌లు శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చామకూరి శ్రీధర్ ని దుశ్శాలవతో సన్మానించి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ వర్తింపజేసేలా అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ జిల్లా వ్యాప్తంగా సుపరిపాలన అందించారన్నారు. ప్రతి చిరు ఉద్యోగం నుండి జిల్లా అధికారులకు బదిలీ సర్వసాధారణమని ఎక్కడ పనిచేసిన నిస్వార్థమైన సేవలు అందించినప్పుడే అధికారికి తగిన గుర్తింపు లభిస్తుందని వారు తెలియజేసారు.

### వైసీపీ మహిళా విభాగం

## అధ్యక్షురాలిగా కే.విజయలక్ష్మి



**తనకల్లు – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12:** శ్రీ సత్య సాయి జిల్లా వైసీపీ నియోజ కవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన కనుమల విజయలక్ష్మి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి నియా మకపు ఉత్తర్వులు అందినట్లు శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. తనను నియోజక వర్గం మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎంపికయ్యేదుకు సహక రించిన పార్టీ సమన్వయ కర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ కు, మండల కన్వీనర్ అశోక్ రెడ్డి, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేసారు. కదిరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా విజయలక్ష్మి వైఎస్ఆర్సీపీ ఆవిర్భావం నుంచి 13 సంవత్సరాలుగా మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

### సర్వసభ్య

## సమావేశానికి అధికారుల గైర్హాజరు

### - హాజరుకాని అధికారులపై ఎంపీపీ అసహనం

**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 12 :** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ మలక్ బషీర్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో ఎంపీపీ మలక్ బషీర్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ చేసిన పని వివరాలు తెలిపి చేయవలసిన పనులను వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వాటర్ ట్యాంకుల ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా వారానికి ఒకసారి వాటర్ ట్యాంకు లను క్లోరినేషన్ చేయించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా కాలువలు పారుదల అయ్యే విధంగా చూడాలని, బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ ఎంపీడీవో, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.






PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )